మెత్తని పులి

మధురాంతకం రాజారాం

ఇంట్లో చండశాసనుడుగా, ఉద్యోగ జీవితంలో సుగ్రీవుడుగా, వూళ్లో సర్వ సమర్థుడుగా బలరామయ్య కెలాటి పేరైతే ఉందో అతని తమ్ముడు గోపాలానికి ఆగస్త్య భ్రాతగా అంతటి ప్రఖ్యాతి ఉంది.

సహోదరులలో ఇలాంటి తేడా కొట్టవచ్చినట్లు కనిపించడం ఆశ్చర్యకరమైన విషయమే! కానీ ఇందుకొక సమాధానం లేకపోలేదు. చేతి వ్రేళ్లన్నీ సమానంగా ఉన్నాయా మరి!......ఐతే ఆలోచించిన కొద్దీ ఇదికూడా కుంటి జవాబుగా స్ఫురించక పోదు. సమానంగా లేకపోతే మానె, చేతి వ్రేళ్ల ఒకదానికొకటి పోలి ఉన్నాయి గదా! అన్నగారు ఇంట్లో పులిలా రొప్పుతుంటే తమ్ముడు పిల్లిలాగా గదిలో నక్కి కూర్చోడమేమిటి? అగ్రజుడు విడిచిపెట్టిన బాణంలా వీధివెంట నడచివస్తూ, అల్లంత దూరాన కనిపిస్తే 'మా అన్నయ్య, మా అన్నయ్య' అంటూ అనుజుడు ప్రక్క సందులోకిగానీ, లేక చెత్త డబ్బా చాటుకుగానీ తప్పుకోడమేమిటి? అన్నదమ్ముల జీవన లక్షణాలలోనే ఇంత వైరుధ్యమా?

బలరామయ్యకు సంఘంలో అంతటి పలుకుబడి తెచ్చిపెట్టిన వాటిల్లో ముఖ్యమైనది— కటువుగా చెప్పాలంటే—అతడి నోరు. కాస్త మృదువుగా చెప్పాలంటే అతడి వాచాలత్వం. మరీ సరళంగా చెప్పాలంటే అతడి వ్యక్తృత్వం.

అన్నగారంతటి వీను మిగిలినవదరుబోతుగదా, మరి తమ్ముడు పెదవి కదపడమే అబ్బురం.

మంచికో చెడ్డకో పదిమంది ఒకచోట సమావేశమై మీటింగన్న పేరుతో ఓ తతంగం జరిపితే చాలు బలరామయ్య తప్పనిసరిగా హాజరు! ఆ సభకు తను అధ్యక్షుడో, లేక ఉపన్యాసకుడో, కాక కేవలం బహుమతులివ్వడానికి రప్పింపబడ్డాడో— ఈ ధర్మసందేహం అతణ్ణి బాధించేదిగాదు. వేదికపైన నిల్చుని గొంతు సవరించి (లేదా సకిలించి) అతడు ఉపన్యాసం అందుకోగానే సభాసీనులైన మహాజనులు 'చచ్చామురా బాబూ, అనుకుంటూ' ఏడుపు మొఖం పెట్టేవారు!

బలరామయ్యను ఉపన్యాసకుణ్ణిగా వరించిన ఒకానొక మీటింగులో జరిగిన గమ్మత్తు ఇక్కడ చెప్పుకో తగ్గది. ఆ మీటింగుకు అధ్యక్షుడు నగరంలో ప్రసిద్ధికెక్కిన ఓ ప్లీడరు గారు. ఆయన కుర్చీలోనుంచి లేచి లేవకుండా "ఇప్పుడు బలరామయ్యగారు 'కో ఆపరేషన్'ను గురించి మాట్లాడుతారు." అన్నారు. పరధ్యానంలో ఉన్నాడో ఏమిటో బలరామయ్యకు 'కో ఆపరేషన్' అన్న పదంలో 'కో' మాత్రం వినిపించింది కాదు. వెంటనే అతడు ప్రారంభించేశాడు.

"సోదర సోదరీ మణులారా! 'ఆపరేషన్' అన్న పదం ఆంగ్ల భాషలోనిది. అందువలన కొందరు 'ఆపరేషను' అన్న వైద్య ప్రక్రియగూడా ఆంగ్లేయుల సంపర్కంవల్లనే మనవాళ్లకు తెలిసివచ్చిందని భావిస్తుంటారు. అది కేవలం భ్రమ! చరకుడు తన వైద్య శాస్త్రంలోనే ఈ సంగతి ప్రస్తావించాడు. కానైతే ఈ ఆంగ్ల పదానికి అక్కడ పర్యాయ పదంగా వాడిన సంస్కృతపదం శస్త్ర చికిత్స. ఈ శస్త్రచికిత్సయొక్క ప్రాధాన్యతను మన పూర్వులు ఎంతగా గుర్తించారంటే, దుష్టాంగాన్ని భేదించి మిగిలిన వాటిని రక్షించడం అత్యవసరమన్న భావం కావ్యాలలోకి కూడా ఎక్కింది...."

సభాసదులు మొదట ఆశ్చర్యపడి, తరువాత తెల్లబోయి, ఆఖరుకు ఘొల్లున నవ్వేశారు.

చెప్ప వచ్చిందేమిటంటే బలరామయ్యకు తెలియని విషయమంటూ ఒకటి లోకంలో లేదు. అతడు నోరు దెరిస్తే నీతులు మణుల్లా ముత్యాల్లా బయట పడడటం పరిపాటి. కాని అనీతులను స్వంతానికి గాకుండా హితోపదేశానికి మాత్రమే వాడుకోడం బలరామయ్య ప్రత్యేకత!

ఐదారు వందలమంది విద్యార్థులు చదువుకుంటున్న ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడుగా బలరామయ్య. 'తన కోపమే తన శత్రువురా వెధవా.....' అంటూ అతడు వో కుర్ర కుంకను చితక బాదేవాడు. 'వేళ తప్పకుండా బడికి రావలెను.' అని రూలింగు జారీచేస్తూ ప్రతిరోజూ ఒకటి రెండు గంటలు ఆలస్యంగా పాఠశాలకు విచ్చేసేవాడు. ఒకవైపున చాడీలు చెప్పరాదు అని విద్యార్థులకు ప్రబోధిస్తూ, తన మాత్రం జవాను పుల్లయ్య ఉపాధ్యాయులపైన చెప్పే కొండేలకు చెవి ఒగ్గేవాడు.

ఇలాంటి బలరామయ్యగారికి గోపాలం తమ్ముడంటే చప్పున నమ్మడమే కష్టం!

తనకు సంబంధించిన ప్రతి వస్తువును గురించీ గొప్పలు చెప్పుకోడం బలరామయ్య అలవాట్లలో ఒకటి. తన గడియారం నిలిచిపోకుండా పాతికేళ్లనుంచీ పనిచేస్తోందనీ, తన అర్ధ రూపాయి పూట కలం పార్కర్ పెనాకంటే బాగా రాస్తుందనీ, తన చెప్పులు మూడేళ్లనుంచీ ఉపయోగిస్తున్నా అరిగి పోలేదనీ అతడెలాగైతే చెప్పుకునేవాడో, అలాగే భార్య పొదుపరితనాన్ని గురించి, కూతురి సంగీత వైశారద్యాన్ని గురించీ, కుమారుల తెలివి తేటల గురించీ చెప్పుకునేవాడు. పై వర్ణనలకు డిటోగా తన స్థిరాస్తి వరాస్థులలో గోపాలాన్నికూడా ఒక చిన్న విభాగంగా క్రింద జమకట్టి "చిన్నవాడుకాదుకదా! పాతి కేళ్లు వచ్చాయి కదా మావాడికి! ఏదీ, ఏనాడైనా నా ఎదుట నిలిచి మాట్లాడి ఎరుగునా! నేను గీచిన గీటు దాటి ఎరుగునా!" అంటూ అతడు తమ్ముడి భ్రాతృభక్తిని గురించి చెప్పుకు పోయేవాడు.

కానీ తన మాటల పునాదులకు వెనుక ఆంతర్యాల వాస్తవాలను గురించి బలరామయ్యకు ఆదినుంచీ అనుమానాలు కద్దు. కూతురి సంగీత విద్యను ఇరుగు పొరుగువారు హృదయపూర్వకంగా మెచ్చుకోడం లేదేమో నన్నది—ఆయన అనుమానాల్లో ఒకటి. పొదుపు ఖర్చులలో మిగిలించిన డబ్బును భార్య తన పుట్టింటికి చేరవేస్తున్నదేమో నన్నది—ఆయన అనుమానాల్లో మరొకటి. బలరామయ్య గొప్పవట వృక్షంలాంటి వాడైతే అందులోని శాఖలన్నీ రకరకాల అనుమాన పిశాచాలకు ఆశ్రయాలు. వాటిలో గోపాలం భ్రాతృ సేవా పరతంత్రతకు సంబంధించిన అనుమాన పిశాచానిది అగ్రస్థానం. అతి వినయం ధూర్త లక్షణమంటారు. అంటే వినయానికి ధూర్తత్వానికీ, భయభక్తులకు తిరుగుబాటుకూ మధ్య అట్టే దూరం లేదన్నమాట! ఇవి అవి గావడం ఏక్షణాన్నయినా సంభవమే! పైగా ఒకసారి చెడిపోయిన పనిముట్టుతో మళ్లీ చివరిదాకా ఇబ్బంది పడక తప్పదు......అందుకనే గోపాలమనే పనిముట్టును ఎంతో జాగ్రత్తగా వాడుకునేవాడు బలరామయ్య. గోపాలాన్ని చిన్న చేతి గడియారంతో పోలిస్తే రోజు కొక్కసారైనా మందలించడం ద్వారా దానికి 'కీ' యిచ్చేవాడు. గోపాలాన్ని కట్టెలు కొట్టే మచ్చుకత్తితో ఉపమిస్తే అది త్రుప్పు పట్టిపోకుండా ప్రతి రోజూ అవసరమైనంత కాయకష్టం కల్పించేవాడు. తమ్ముణ్ణి పెందలకడనే నిద్రలేచి, పాఠములు శ్రద్ధగా చదువుకుని వేళ దప్పక బడికేగు మంచి కుర్రవాణ్ణిగా మలచడంలో బలరామయ్య కృతకృత్యుడు కాగలిగాడనే చెప్పవచ్చు. గోపాలం ఉదయం అయిదు గంటలకల్లా నిద్ర లేచేవాడు. అన్నగారి పిల్లలకు 'హోంవర్కుల' లాంటివి చేసిపెట్టేవాడు. తరువాత కాలకృత్యాలు తీర్చుకుని, వదినగారిచ్చిన చిల్లరడబ్బులు జేబులో వేసుకుని మార్కెట్టుకు వెళ్లి వచ్చేవాడు. అప్పటికి వదినగారూ, గోడ గడియారమూ పరస్పరం పోటీకి తలపడి ఉండేవారు. ఆ పోటీలో వదినగారు గెలిచి వంట కాస్త త్వరగా ముగిస్తే గోపాలం వేళకు ఆఫీసుకు వెళ్లగలిగేవాడు. అలా కాకుండా వదినగారు వోడిపోయి గోడ గడియారం గెలిస్తే ఆఫీసుకు వెళ్లడంలో ఆలస్యమూ, ఏ తత్ఫలితంగా ఆఫీసరుగారి చీవాట్లు గోపాలానికి తప్పేవికావు.

మధ్యాహ్నం విశ్రాంతి సమయంలో స్వల్పంగా ఉపాహారం, వేడిగా ఓ అరకప్పు కాఫీ మాత్రం సేవించి సాయంత్రం ఆరుగంటల వేళకు యిల్లు చేరుకునేసరికి గోపాలానికి కాళ్లు చేతులు ఎక్కడివక్కడే పూడిపోయినంత నీరసంగా ఉండేది. అంత నీరసంలోనూ అతడు లాంధర్లు తుడిచి, దీపాలు వెలిగించి ఒకటి రెండు గంటలసేపు ఒక చిన్న నీతి పలుకూటాన్ని నిర్వహింపవలసి వచ్చేది. ఆపిమ్మట నింపాదిగా పిల్లల భోజనం. ఆ పంక్తి లేచిన తర్వాత బలరామయ్యగారు భోజనానికి కూర్చుంటే భార్యతో ఎక్కడలేని లోకాభిరామాయణాలన్నీ వంటగదిలోనే ముచ్చటింపబడేవి ! భోజనం కాగానే తాంబూలం సేవించడం బలరామయ్య అలవాటు. ఆ అలవాటు కెక్కడ వేళాతిక్రమణ జరుగుతుందోనని గోపాలం తొందర తొందరగా తిన్నశాస్త్రం ముగించేవాడు. బంకు దగ్గరికి వెళ్లి తమలపాకులు, వక్కపొట్లాలు తీసుకొచ్చేవాడు. అన్నగారు హాల్లో ఉంటే వరాండాలోనూ, వరాండాలో ఉంటే హాల్లోనూ కొంతసేపు పచార్లు చేసి యింక తనకోసం పురమాయించబడే పను లేవీ లేవన్న కచ్చితమైన నిర్ధారణకు రాగలిగిన తర్వాత చాపా, దిండు తీసుకుని డాబాపైకి వెళ్లి పోయేవాడు.

శరీరం సొమ్మసిల్లిపోయిన స్థితిలో ఆలోచనలకు పూనుకునేపాటి ఓపిక మెదడు కుండదు. గోపాలానికి అమాంతంగా నిద్ర ముంచుకొచ్చేసేది. రాత్రి పది గంటల కనగా పట్టిన నిద్ర ఉదయం అయిదు గంటల దాకా అతణ్ణి తన ఒడిలో నుంచీ కదలనిచ్చేదిగాదు. అప్పుడు ఉలికిపడి నిద్రలేచేవాడు. గోపాలం. ఇంట్లో కాఫీపొడి నిండుకున్నదేమో ! బాయిలర్‌లోకి బొగ్గులు కావాలేమో ! మార్కెట్టుకు వెళ్లడం ఆలస్యమౌతుందేమో !

ఆశ్చర్యమేమిటంటే ఆ కుటుంబం, ఆ దినచర్య, ఆ జీవితము అవన్నీ ఎలా ఉండాలో అలాగే ఉన్నట్టు, వాటిని గురించి చెప్పుకోవలసిన రిమార్కులేవీ లేనట్టు భావించేవాడు గోపాలం. ఇంతకంటే ఆశించదగ్గ సుఖ సంతోషాలు పృథ్వీతలంపైన లేక పోలేదన్న స్పృహయినా అతనికి కలిగేది కాదు. ఆవిధంగా అతడి జీవితంలో పాతికేళ్లు గడిచి పోయాయి. ఆ తరువాతనైనా అతనికి ఆత్మజ్ఞానం స్వతహాగా కలిగిందని చెప్పలేము ! ఓ వ్యక్తి గోపాలానికి జ్ఞానోదయం కలగడానికి తోడ్పడింది. ఆమె పేరు పార్వతి.

2

పార్వతిని నాలుగైదు విధాలుగా నిర్వచించవచ్చు. ఆమె ఇంటికి వచ్చిన క్రొత్త కోడలు. ఆ తరువాత బలరామయ్యగారి మరదలు. ఆపైన బలరామయ్యగారారి భార్యకు తోడుకోడలు. చిట్ట చివర గోపాలం భార్య.

బొద్దు మీసాలతోనూ, ఎర్రటి కళ్లతోనూ పెద్దపులిలా కనిపించే బలరామయ్య కంటికి కనిపించకుండా పార్వతి ఆయింట ఒదుగుళ్లుపోయేది. తెచ్చిపెట్టుకున్న అనారోగ్యపు చిహ్నాలతో లేచి తిరగడానికే ఆపసోపాలు పడిపోయే తోడుకోడలికి వొకవైపు సపర్యలు చేస్తూ మరోవైపున గృహకృత్యాల నన్నింటినీ తనొక్కతే చక్కబెట్టు

పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదియు, మీ సరియైన చర్యను గురించియు మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన మీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేదీ, వేళవివరములున్నూ, మీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసిపంపండి. జ్యోతిషశాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసినతేది లగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో మీకు జయము కలుగునో, ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు.1.25న. పై. లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. ఛార్జీలు ప్రత్యేకం). దుష్టగ్రహములేవైనా ఉన్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపై పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా లేనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

PT. DEV DUTT SHASTRI, RAJ JYOTHISHI (A.W.P)
P. B. 86, JULLUNDUR CITY.

మిల్క్ ఆఫ్ మెగ్నీసియా అంటే ఏమిటి?

అది మెగ్నీసియం హైడ్రాక్సైడ్ యొక్క ఎమల్షన్—పిత్తమును అరికట్టి, విరోచనకారిగా పనిచేసి, సకల విధములగు గ్యాస్ట్రిక్ పరిస్థితులను మాన్పుటకు విరివిగా వాడబడుచున్న పదార్థము.

మిల్క్ ఆఫ్ మెగ్నీసియాను మెగ్నీసియం హైడ్రాక్సైడ్ మిక్చరు బి. పి., మెగ్నీసియా మాగ్మా యూ. ఎస్. పి., క్రీం ఆఫ్ మెగ్నీసియా బి. పి., మొదలగు పేర్లు కూడా ఉపయోగిస్తారు. దానికి ఏ పేరు పెట్టినా, అసలు పదార్థము ఒక్కటే. ఎల్లరు అంగీకరించే ఫార్మాకోపియాలో విధించిన కఠిన మాత్రాలను, ప్రమాణాలను అనుసరించియే ఇది తయారుచేయబడుతుంది. వ్యాపార సరళి కొరకు ఒక పేరు పెట్టి మిల్క్ ఆఫ్ మెగ్నీసియాను అమ్మినప్పటికీ, ఆ వస్తువు నాణ్యత ఎంతమాత్రము తగ్గుట గాని, హెచ్చుటగాని జరుగదు. దానిని తయారుచేయువారిని గుర్తించుటకు మాత్రమే ఆ పేరు పనికొస్తుంది.

కాని, వాడుకదారుని మనస్తత్వము ప్రకారము ఈ వ్యాపార నామమునకు ముఖ్యత ఏర్పడుతుంది. ఏమంటే, ఎల్లరు మంచిదిగా ఎరిగిన పేరు దానిని తయారుచేయువారి నిజాయితీని గూర్చి వాడుకదారునికి పలసిన హామీ నిస్తుంది. అందువలననే లెక్కకు మిక్కుటమగు వాడుకదార్లు ప్రతిరోజు MandH మిల్క్ ఆఫ్ మెగ్నీసియాను కొంటున్నారు. అది యునైటెడ్ స్టేట్స్ ఫార్మాకోపియాలోని మాత్రాల ననుసరించి తయారుచేయబడి, ఉత్పత్తివిధానంలో ప్రతిమెట్టువద్ద దాని నాణ్యత కొరతపడకుండ పరీక్షింపబడి, స్వచ్ఛతలోను, పనితనములోను సంపూర్ణ దోషరహితముగ నుండుటయేకాక, అన్నిటికన్న మిన్నగ, తదితర MandH ఫార్మాస్యూటికల్ వస్తువులవలె ఔషధ క్షేత్రంలో ఏభై ఏండ్లకు పైగా గడించిన అనుభవము దీని వెంటయుండుట తటస్థించినది.

మార్టిన్ అండ్ హారిస్ ప్రై॥ లి॥
రిజిస్టర్డ్ ఆఫీసు : మర్కెంటైల్ బిల్డింగ్స్, లాల్ బజారు, కలకత్తా—1

మెత్తని పులి

కునేది. తల దువ్వమని, చొక్కా తొడగమని, దుస్తులు మార్చమని మారాముచేస్తూ చుట్టుముట్టే బావగారి పిల్లలను సముదాయించేసరికి ఆ అనుభవం లేని యిల్లాలికి తల ప్రాణం తోక కొచ్చినంత పనయ్యేది. తెల్లవారుజామున అయిదు గంటలకంతా ఆ యిల్లు కార్ఖానాలా నిద్రలేస్తుంది. పెరట్లో బాయిలరు. వంట యింట్లో కాఫీ కోసం కుంపటి. అంతలో ఉపాహారం కోసం తహతహ. స్నానాలు చేయించి, బట్టలు మార్చి, ఉపాహారంతో సంతృప్తి పరచి పిల్లల్ని ఆలస్యంగాకుండా ఎనిమిదిన్నరకు బడికి పంపడం ఓ యజ్ఞాన్ని సాకల్యంగా చేసి ముగించినంత తతంగం! ఇక అప్పటినుంచి బలరామయ్యగారికి తమ హెడ్మాష్టరు గిరీ జ్ఞప్తికి వచ్చి—బడికి బయల్దేరే సన్నాహం ప్రారంభమౌతుంది. సమయానికి కాయనకు పాదరక్షలు కనిపించవు. గొడుగు కనిపించదు. ఉండినా వూడినా ఒక్కటే అయిన కళ్లజోడు కనిపించదు. భర్తగారు బడికి ఆయత్తమయ్యే హంగామాతో అందాకా నీరసంగా పడిఉండే గృహిణిలో స్త్రైతం ఎక్కడలేని చైతన్యం పుట్టుకొచ్చేస్తుంది. కనిపించని పుస్తకాల కోసం, కలాలకోసం యిద్దరూ చేరి యిల్లంతా చిందరవందర చేసేస్తారు. అంతటి గగ్గోలులోనూ ఆ యింట్లో కనిపించనిది గోపాలం పాలకువ ఒక్కటే! వినిపించనిది గోపాలం అలికిడి ఒక్కటే!

గోపాలం లేకపోతే తెరలు లేవవు. దీపాలు వెలుగవు. శబ్ద విస్తరణ యంత్రాలు పలుకవు. గృహనిర్వహణ అన్న నాటకంలో అతని పాత్ర ప్రముఖమైనదని నిస్సందేహంగా చెప్పవచ్చు. కాని ఎటొచ్చీ, తెర వెనుకనే ఉండిపోయే పాత్ర అతనిది.

కానీ పార్వతి కాపురానికి వచ్చినప్పటినుంచీ గోపాలంలో కొత్తగా కొన్ని మార్పు లొచ్చాయి. మొదటిది, ఎప్పట్లాగే నది మునుపటిలా అతనికి నిద్ర పట్టడంలేదు. పార్వతి నిద్రపోయి, తానొంటరిగా మేలుకుని పైకప్పుకేసి చూస్తూ పడుకున్న సమయాల్లో అతని మనసులో ఏవేవో ఆలోచనలు రగులుకునేవి—ఈ యిల్లు, ప్రపంచమూ ఒక్కనాటిరీగా కనిపించడంలేదు. సాయంకాలాల్లో తానింటికి తిరిగి వస్తున్నప్పుడు చేయి చేయి కలుపుకుని వాహ్యాళికి వెళ్తున్న భార్యాభర్తల్ని ఎందర్ని చూడలేదు? సినిమా థియేటరులో కండ్ల ఎదుట కనిపించే వెండి తెరపైని దృశ్యాల కంటే, వెను దిరిగి చూస్తే జంటలు జంటలుగా బారులు దీర్చి కూర్చున్న ఆలు మగల దృశ్యమే తనకు సహజ సుందరంగా, కన్నులకు విందుగా కనిపిస్తుంది. గంటల తరబడి ఎదురెదురుగా కూర్చుని వాగ్వాదాలతోనూ, పరిహాసాలతోనూ కాలంగడిపే దంపతులు కూడా ప్రపంచంలో దండిగానే కనిపిస్తారు. ఆ చైతన్యాన్ని సంభ్రమాన్ని తానెన్నడూ చవిచూడలేదు. చవిచూడలేడేమో! ఎందువల్ల? లోకంలో కోకొల్లలుగా కనిపిస్తున్న సుఖసంతోషాలకూ తనకూ మధ్య అడ్డుగోడ ఎందుకు ఏర్పడింది? ఎవరు ఏర్పరిచారు? దీన్ని కూలదోసి నేలమట్టం చేయాలంటే అందుకు ఉపాయం ఏమిటి?

పెళ్లయిన క్రొత్తలో ఓ రోజు రాత్రి అంది

పార్వతి—"ఏమండీ ! ఎదురింటావిడ కట్టుకున్న చీర చూచారా ? చాల బాగుందికదూ !"

ఆ మాటల్లో—నాకైతే మరీ బాగుంటుంది. కనుక కొనిపెట్టండి—అన్న ధ్వని వినిపించడంతో చకితుడైపోయాడు గోపాలం.

తనైతే 'ఎదురింటావిడ కట్టుకున్న కొత్త చీరను చూడడం తటస్థించలేదు. బహుశా అది బాగానే ఉంటుంది. వెల గూడా అంత గిరాకీ గాక పోవచ్చు. ముచ్చటపడినప్పుడల్లా పెళ్లాని కొక చీర కొనిపెట్టడం పొరుగింటాయన రివాజు, తన కలాంటి సౌలభ్య మెక్కడిది ?

విద్యా వివేకాలకు, లోకంలో ప్రయోజకుడుగా పరిగణింపబడటానికి సంబంధం ఉన్నట్టు తోచదు. కేవలం ఆర్థిక సంబంధమైన లావాదేవీల వలన మాత్రమే సిద్ధించేది ప్రయోజకత్వం. పాతికేళ్ల జీవితంలో ఒకరిని తను అప్పు అడిగినట్టుగానీ, లేదా ఒకరికి చేబదులు యిచ్చినట్టుగానీ గుర్తు లేదు. తను న్యూసుపేపరు కొన్నాడంటే అది అన్నగారి కోసం ! క్రాపు దువ్వెన కొన్నాడంటే అది అన్నగారి బిడ్డల కోసం !

ప్రీతిపాత్రుడైన శిష్యునితో గురువు "నిన్ను నా అంతటివాణ్ణిగా చేస్తాను" అని చెబుతాడు. ఓ వ్యక్తియొక్క పలుకుబడికి, పరపతికి మొదట అతడి కుటుంబంలోనుంచీ దోహదక్రియలు సమకూరవలసి ఉంటుంది. కుటుంబంలో పూచిక పుల్లతో సమానంగానైనా పరిగణన లేనివాడు యిక లోకంలో ఎలా గుర్తింపబడగలడు ?

గోపాలం కుమిలిపోసాగాడు. తను తెగువ చేసి పెళ్లాని కొక చీర కొనిపెట్టలేని అసమర్థుడు. పెళ్లయి ఆరుమాసా లౌతున్నా భార్యనొక్కసారి సినిమాకు తీసికెళ్లని అప్రయోజకుడు. వెయ్యిమాట లెందుకు—ఏవిధంగా చూచినా తను చేతగానివాడు.

"అదేమిటండీ ! ఇటీవల మీరు ఉత్సాహంగా 'నిపించడంలేదే !" ఒరోజు పార్వతి రాత్రి గోపాలన్ని ప్రశ్నించింది.

గోపాలాని కొక్కసారి గొంతెత్తి ఏడవా లనిపించింది.

"ఏం చేయమంటావు పార్వతీ ! నా బ్రతు కిలా పరిణమించింది. ఈ యింట్లో గట్టిగా వూపిరి పీల్చి వదలడానికే నాకు భయం. అనవసరంగా నేనెందు కిలా భయపడుతున్నానా అని వితర్కించుకుంటున్నాను. కారణం బోధపడటంలేదు. అకారణమైన భయంతో నేను తాబేలులా నాలో నేనే ముడుచుక పోవడానికి అలవాటు పడిపోయాను" అన్నాడు గోపాలం.

ఈ పరిణామానికి పార్వతి ఎంతగానో సంతోషించింది. ఎలాగైతేనేం, జడ పదార్థంలాంటి ఈ మానవుడిలో ఆలోచన ప్రారంభమైంది. తీవ్రమైన ఆలోచన మానవుణ్ణి కార్యశూరత్వానికి ప్రేరేపిస్తుంది.

సరిగ్గా అదే సమయానికి బలరామయ్య భార్య ఏమండీ ! నిద్రపోయారా" అంది.

"ఇంకా లేదు" అన్నాడు బలరామయ్య.

"కొద్ది రోజుల నుంచీ మీ తమ్ముడి వాలకం ఒదొక రకంగా కనిపించడంలేదూ ?"

"ఒక యింటివా డయ్యాడు గదా ! సంసార సాగరాన్ని ఎలా ఈదడమన్న దిగులేమోలే !" అని తన ఛలోక్తికి తానే నవ్వసాగాడు బలరామయ్య.

3

గోపాలాని కొక శుభవార్త తెలిసింది—

కొలది మాసాల్లో తాను తండ్రి కాబోతున్నాడు !

అతని కొక సినీమా పాట జ్ఞప్తికి వచ్చింది. 'నేను పుట్టిన కారణ మేమిటో నాకు తెలియక మునుపే నువ్వెందుకు పుట్టావురా బాబూ' అని ఆ చిత్రంలో కథానాయకుడు వాపోతాడు.

గోపాలం వితర్కించుకోసాగాడు—నిజమే ! తా నెందుకు పుట్టినట్టు ? విస్వార్థంగా అన్నగారికి, ఆయన సంసారానికి సేవలు చేయడానికేనని తానైతే సరిపెట్టుకోగలడు. కానీ తనను కట్టుకున్న నేరానికి ఓ అయినింటి అమ్మాయిని పీడించడం ఏం న్యాయం ?

ఆలోచించినకొద్దీ గోపాలానికి కొత్త కొత్త విషయాలు బోధపడుతూ వచ్చాయి. తనకు పెళ్లి చేయడంలో గూడా అన్నగారి ఉద్దేశం వేరు.

బజార్లో ఏడుస్తున్న ఓ పిల్లను "ఎందు కేడుస్తున్నావు" అని అడిగాడు దారినిపోతున్న పెద్ద మనిషి.

పిల్లవాడు: మా అన్నయ్యకు వేసవి సెలవలిచ్చారు. నాకివ్వ లేదు.

పెద్దమనిషి : ఎందుకని ?

పిల్లవాడు: నే నింకా బడిలో చేరలేదు.

ఆంజనేయులు (రావినూతల)

పెళ్లిచేసుకుని తమ్ముడొక ఇంటివాడైతే ఆయనకు ఒరిగేదేమీ లేదు. ఐనా వెట్టి చాకిరీ చేయడానికి శాశ్వతంగా ఓ పనిమనిషి లభించడం మాత్రం అదెంత వెసులుబాటు కాదు? పార్వతిని కానుపు కోసం పంపమని వాళ్ల పుట్టింటివాళ్లు వచ్చి అడిగినప్పుడల్లా యిప్పుడు గాదని బలరామయ్యగారు వాయిదా వేస్తూ రావడంతో గోపాలం వూహ మరింతగా బలపడసాగింది.

ముంత పొగ పెట్టినట్టున్న ఆ కుటుంబ వాతావరణంలో ఉక్కిరిబిక్కిరైపోయిన గోపాలం లేని తెగువ కొనితెచ్చుకుని భార్యతో ఒక్క మాట మాత్రం చెప్పేశాడు— "ఎలాగో నువ్వు కానుపుకు పుట్టింటికి వెళ్తున్నావు గదా పార్వతీ ! నువ్వు తిరిగొచ్చేసరికి మన బ్రతుకిలా ఉండదు. కానీ అది ఎలా పరిణమిస్తుందో నేను స్పష్టంగా వూహించలేకుండా ఉన్నాను ...."

పార్వతి పుట్టింటికి వెళ్లింది.

రోజులు గడిచిపోతున్నాయి.

సాధ్యమైనంతలో గోపాలానికి ఒక్కటే ఉపాయం స్ఫురించింది. అతడు ట్రాన్స్‌ఫరు కోసం ప్రయత్నించి చూచాడు. కానీ ససేమిరా వీల్లేదన్నాడు ఆఫీసరు—"అదేమిటోయ్ గోపాలం ! ఈ వూరివాడివి. బాగా పనిచేస్తున్న కుర్రాడివి. వృద్ధిలోకి రావలసినవాడివి. 'రోలింగు స్టోను' ను గురించిన సామెత తెలియదా నీకు ! ఏ పరిస్థితిలోనూ నీకు ట్రాన్స్‌ఫరు వాంఛనీయంగాదు. నా మట్టుకు నేను మాత్రం ఆమోదించను" అంటూ ఆయన గోపాలం ఆశను సమూలంగా తుడిచిపెట్టేశాడు.

మళ్లీ ఉపాయాంతర అన్వేషణ ఒక్కటే శరణ్యమైంది గోపాలానికి !

లీలగా ఒక మార్గం పొడగట్టింది. గానీ అది చాలా కష్టసాధ్యమైన మార్గం. వూహించడానికే వెరపు గొలిపే మార్గం.—కానీ గత్యంతరంలేదు !

గోపాలం లెక్కలేనన్నిసార్లు ధైర్యం చేశాడు. అన్నగారి ఎదుటకు వెళ్లేవాడు. పెదవి కదిలించి గొంతుక సవరించుకునేవాడు. తమ్ముడేదో చెప్పబోతున్నాడని గ్రహించి అతడివైపు చూచీ చూడకుండా 'ఏమిట్రా' అంటూ ముఖం చిట్లించుకునేవాడు బలరామయ్య. అంతటితో గోపాలంలో ధైర్యం దిగజారిపోయేది. "ఏముంది ! ఏంలేదన్నయ్యా" అంటూ అతడు దూరంగా జారుకునేవాడు.

కట్టకడకు ఇలాగైతే లాభంలేదనుకున్నాడు గోపాలం. కానీ ఒకటి మాత్రం నిజం ! తను ముఖాముఖిగా అన్నగారి ఎదుట నిలిచి మాట్లాడలేడు. ఐతే యిప్పుడు ఉపాయం ఏమిటి ? గోపాలం ఓ నిర్ణయానికి వచ్చి రంగనాథం దగ్గరకు బయల్దేరాడు.

ఈ విశాల ప్రపంచంలో బలరామయ్యకు అప్తమిత్రులని చెప్పుకోతగ్గ ఇద్దరు ముగ్గురిలో రంగనాథం ఒకడు. వృత్తిరీత్యా అతడు యిన్స్యూరెన్సు ఏజంటు. ఎదుటివాడు తన సలహాకు బొత్తిగా విముఖంగా ఉన్నప్పటికీ నాలుగు మంచి మాటలతో అతణ్ణి సుముఖుణ్ణిగా చేసుకోగల వాక్చాతుర్యం అతడి సొమ్ము.

"ఏమిటోయ్ గోపాలం! రాక రాక ఇలా వచ్చేశావ్! రా, కూర్చో. విశేషాలేమిటి?" అంటూ పరామర్శించాడు రంగనాథం.

"అబ్బే, ఏమున్నాయండి" అంటూ నీళ్ళు నమిలి, అయిదు నిమిషాలు మౌనంగా కూర్చున్నాడు గోపాలం.

"విశేషమే లేకుంటే నువ్వు నన్నింత దూరం వెతుక్కుంటూ వచ్చేవాడివే గావు. చెప్పవయ్యా గోపాలం! మొగమాట మెందుకు?" అన్నాడు రంగనాథం.

"మరేం లేదండి! కారణా లేవైతే నేమి! చిన్న ఇల్లొకటి అద్దెకు తీసుకుని వేరుగా ఉండిపోవాలనుకుంటున్నాను............"

"అలాగా గోపాలం! మంచిదే కదూ మరి! ఎన్నాళ్ళు కలిసి ఉన్నా ఎప్పుడో ఒకప్పుడు వేరు కావలసిందే. కక్షలూ, కార్పణ్యాలు లేకుండా మూారెడు హెచ్చూ తక్కువగా— ఉన్న ఆస్తిపాస్తులను పంచుకుంటే సరిపోతుంది. బలరామయ్యతో నేను చెబుతానుండు."

ఓ క్లిష్ట సమస్యను పరిష్కరించిన తృప్తితో గోపాలం ఆఫీసుకు వెళ్లాడు. అయిదు గంటలవరకు పనిచేశాడు. ఆ తరువాత మెల్లగా రోడ్డుపైకి

వచ్చాడు. అప్పుడతని బుర్రలో అశనిపాతంలాంటి కదలిక ఒకటి బయల్దేరింది. కొంపదీసి ఈపాటికే రంగనాథం అన్నగారిని కలుసుకున్నాడేమో! అబ్బే, అదెలా సాధ్యమవుతుంది.? చెప్పగానే తన పని చేసి పెట్టడానికి అంతగా పనుల తొందరలేని వాడా రంగనాథం.........

కానీ రంగనాథంయొక్క స్వంత పని ఎప్పుడూ ఇతరుల పనులకు అడ్డు తగలడమేనని గోపాలానికి తెలియదు.

గోపాలం రాకకోసం ఎదురు తెన్నులు చూస్తూ కూర్చున్న బలరామయ్య అతడు కనిపించగానే అగ్గ హోద్రగుడై పైకి లేచాడు—

"ఏమిట్రా! ఆ అడిగేదేదో నా ముఖాన్నే అడగ రాదూ! ఆ రంగనాథంగాడి మధ్యవర్తిత్వం కావలసి వచ్చిందా నీకు!"

గోపాలం నేరస్తునిలా తలవంచుకుని స్తంభం చాటున నిల్చున్నాడు.

"ఫూ! నువ్వు ఆస్తిపాస్తుల పంపిణీ కోసం కాచుక కూర్చున్నావన్న మాట! కథ అందాక వచ్చిం దన్నమాట! ఒరేయ్ గోపాలం! రంగనాథం కాదు, అలాంటి వాళ్ళు వెయ్యిమంది వచ్చినా సరే నా బొందిలో ఊపిరుండగా ఆ పని మాత్రం జరగదు................"

గోపాలం సాహసంచేసి "ఆస్తి సంగతి నేనెత్త లేదన్నయ్యా! ప్రత్యేకంగా ఉండదలచుకున్నానని చెప్పాను........." అన్నాడు.

"ఓహోహోహో, అలాగట్రా బాబూ! ప్రత్యేకంగా ఉండదలచుకున్న వాడివి నువ్వు మళ్ళీ ఇక్కడికెందుకు రావలసి వచ్చిందని నేనడుగుతున్నాను. నువ్వింక ఒక క్షణం నాయింట్లో ఉండటానికి వీల్లేదు. వెళ్ళు, వెళ్ళిపో................"

పురాణ కాలంనాటి బలరాముడు ఒకప్పుడు హస్తినాపురాన్ని తన నాగేటి క్రుతో పెకలించ దలచుకున్నాడట.! పెకలించక పోయినా, పెకలించ టానికి కావలసినంత కోపావేశంతో ఆతడు ఒడలు మరచిపోయి వుంటాడు. బలరామయ్యకూ్కడా సరిగ్గా అంతే కోపం వచ్చింది. అతడు గోపాలాన్ని తోసు కుంటూ వెళ్ళి బయటికి గెంటి వీధి తలుపు దభాలున వేసుకున్నాడు.

దిమ్మెక్కిపోయిన తలలో గోపాలం కాసేపు వసారా గుంజ కానుకుని విగ్రహంలా నిల్చున్నాడు. ఇరుగిండ్లవారు, పొరుగిండ్లవారు కిటికిల్లోనుంచీ అతడి దురవస్థను చూచి జాలిపడుతున్నారు. ఒక్కొక్క ప్పుడు సానుభూతిని గూడా భరించడం కష్టం. గోపాలం వీధిలోకివచ్చాడు. చరచరా నాలుగు ఫర్లాంగుల దూరం నడిచాడు. అక్కడొక చిన్న పార్కు, తెరచిన తలుపులతో, చల్లటి గాలితో, రేడియో గానంతో సాదరంగా గోపాలాన్ని లోనికి ఆహ్వానించింది.

అన్నగారి నిష్ఠుర ప్రవర్తనను తలచుకుంటూ గోపాలం ఓ సిమెంటు బెంచీ పైకి వాలిపోయాడు.

ఓ రక్తం పంచుకుని పుట్టిన అన్నదమ్ములు కొన్నాళ్ళ పాటు కలిసి ఉండి, ఏహో యిబ్బందుల మూలంగా వేరు పడడం సాధారణంగా సమిష్టి కుటుం బాల్లో జరిగే మామూలు సంఘటనే. అన్నదమ్ము ళ్ళన్న తర్వాత ఎన్నాళ్ళు కలిసి ఉన్నా ఎప్పటికైనా వేరుబాటు తప్పదు. ఈ మాత్రం పరిజ్ఞానం లేకుండా ఈయన తనపైనుండిపడతా డెందుకు? ఆస్తిలో వాటా అడగడం మహాపరాధమా! అంతమాటా అడగకముందే ఈయన తనను ఇంట్లోనుంచీ వెళ్ళి పొమ్మంటాడా? అదీ స్వంత ఇల్లయినా కాదు అద్దె కొంప!...........

ఎడతెగని ఆలోచనల అలజడిలో అలాగే సొమ్మ సిల్లి ఆ బెంచీ పైనే నిద్ర పోయాడు గోపాలం.

4

గోపాలాన్ని యింటినుంచీ వెళ్ళగొట్టిన తర్వాత అయిదారు మాసాలు కాలగర్భంలో కలిసిపోయాయి. అతడేమై పోయాడో బలరామయ్యకు తెలియదు. కనీసం తెలుసుకోవాలనిగూడా అతడు ప్రయత్నించ లేదు.

—అప్రయోజకుడు— వాడేమై ఉంటాడు? ఉద్యోగానికి రాజీనామా పెట్టి ఏకంగా అత్తగారింటికి వెళ్ళిపోయాడేమో! లేకుంటే తనంతట తనే కోరి మరొక వూరికి బదిలీ అయిపోయాడేమో! ఏమైతే నేమి? తను వాడికి సరైన శాస్తి చేశాడు. ఇక జీవితంలో వాడు తన ఎదుట నిలిచి ఆస్తి పంచి పెట్టమని అడగలేడు!

అధికారి : ఏమయ్యా రోజూ ఆఫీసుకు లేటుగా వస్తున్నావ్? నీ ఉద్యోగం 'టెంపరరీ' అని తెలీదా !

గుమాస్తా : తెలీకేమండీ! అది 'పర్మనెంట్' కాదని కూడా తెలుసు.

మాధవ్ (తెనాలి)

ఇలా వూహించడంలో బలరామయ్య పొరబడి నట్టు చెప్పలేము. ఎందుకంటే ఆ తరువాత ఎన్నడూ గోపాలం బలరామయ్య ఎదుటకు రాలేదు. లేదంటే ఒకసారి బలరామయ్యే గోపాలం ఎదుటకు వెళ్లవలసి వచ్చింది.

ఓ రోజు యింటి కామందు బలరామయ్యకు కబురుపెట్టి వారం పది రోజుల్లో యింటిని ఖాళీ చేసేయమన్నాడు.

"అబ్బే అదెలా కుదురుతుందండీ! మీ యింటిని వదలడానికిముందు నేను మరో ఇల్లు చూచుకోవాలి గదా!" అన్నాడు బలరామయ్య.

"ఏం చేయమంటారు పంతులుగారూ! ఇంటిపైన బేరం తగిలింది. అడ్వాన్సుగూడా తీసుకున్నాను. నాలుగు రోజుల్లో రిజిస్ట్రేషను జరుగబోతోంది" అన్నాడు యింటి కామందు.

చేసేది లేక బలరామయ్య భార్యను బిడ్డలతో సహా పుట్టింటికి తరలించి, తనొక మిత్రుడి గృహంలో మకాంపెట్టి యింటిని ఖాళీచేసి యజమానికి అప్ప గించేశాడు.

తీరా యిల్లు ఖాళీచేసిన తర్వాత వారం రోజులకు బలరామయ్యకో విషయం జ్ఞప్తికి వచ్చింది. పద హేనేళ్ళనుంచి తన ముఖానికి అలంకార ప్రాయంగా ఉంటూ తన బాహ్య వేషానికొక హంగును సమకూ ర్చిన వెల్లద్దాల కళ్లజోడు పెట్టెలో వెదికినా కనిపించడం లేదు. బహుశా ఖాళీ చేసిన ఇంట్లో ఏ వాసంపైన్నో, లేక ఏ అలమారాలోనో ఉంచి తను మరచి పోయి ఉండాలి.....ఎలాగూ అది మళ్ళీ దొరుకు తుందన్న నమ్మకంలేదు. కానీ ప్రయత్నించడంలో తప్పులేదుగదా!

కళ్లజోడు పైన మమకారం బలరామయ్యను మళ్ళీ ఒకసారి ఆతడు వదలిపెట్టిన వచ్చిన యింటి వైపు లాక్కెళ్ళింది. రాత్రి ఎనిమిది గంటల వేళ. ఇంటి ముంగిట ఎవరూ లేరు. వెల్లవేసిన గోడలు తెల్లగా కళ కళలాడుతున్నాయి. క్రొత్తగా తీర్చిన రంగవల్లికలతో అరుగులు అందంగా ఉన్నాయి. గృహాంతర్భాగం కూడా మునుపటికన్నా పరిశుభ్రంగా, కుర్చీలు బెంచీలు లాంటి క్రొంగ్రొత్త ఫర్నిచరుతో ఆహ్లాదకరంగా కనిపిస్తోంది.

"ఏమండీ......సార్" అంటూ ఒకటి రెండుసార్లు పిలిచాడు బలరామయ్య. రేడియో సంగీతంలో అతడి పిలుపు లోపలికి వినిపించినట్లు లేదు.

అతడు ద్వారం దాటుకుని గదుల మధ్య దారిలోనుంచీ హాల్లోకి వెళ్ళాడు.

ఆ హాల్లో కనిపించిన దృశ్యం బలరామయ్యను నిశ్చేష్టుణ్నిగా చేసి నిలబెట్టింది.

ఈజీ చేర్లో గోపాలం. క్రింది చాపపైన పార్వతి. భార్య తమలపాకుల చిలకలు చుట్టి భర్త కంది స్తోంది. అతడు తాంబూలం నములుతూ శ్రావ్య మైన దక్షిణాది సంగీతం వింటున్నాడు.

అన్నగారిని చూడగానే విద్యుద్ఘాతం తిన్న వాడిలా తమ్ముడు తటాలున లేచి నిల్చున్నాడు. మరు క్షణాన అతడక్కడ లేదు. హాలుకు వెనుక వంట గదిలో ఉన్నాడు. ఆపాటికే అక్కడ చేరి ఓ మూలగా నక్కి నిల్చున్న పార్వతి వైపు దీనంగా చూస్తూ "బాబ్బాబూ! నీకు పుణ్యముంటుంది. వచ్చి కూర్చో మని చెప్పు పార్వతీ!" అంటూ బ్రతిమాలుకున్నాడు గోపాలం.

ఆ సందిగ్ధ పరిస్థితిలో అబల సబలగాక తప్పింది గాదు. "నిల్చున్నారేం బావా? రండి. కూచోండి" అంటూ వచ్చిన అతిధి కాళ్ళు కడుక్కోటానికి పెద్ద చెంబు నిండుకు నీళ్లు తీసుకుని ఎదురు వెళ్ళింది పార్వతి.

బలరామయ్య మరబొమ్మలా వాలు కుర్చీలో కూర్చున్నాడు.

తొట్టిలో పడుకున్న బిడ్డను తీసుకొచ్చి పార్వతి పెదనాన్నగారి ఒడిలో పడుకో బెట్టింది.

పది నిమిషాల నీరవ నిశ్శబ్దం తరువాత బిడ్డ లేచి ఏడుపు లంకించుకున్నాడు.

బిడ్డను చేతికి తీసుకుంటూ "లేచి కాళ్ళు కడు క్కోండి బావా! విస్తరి వేశాను" అంది పార్వతి.

"అబ్బే, అవసరం లేదమ్మా! భోజనంచేసే వచ్చాను." అంటూ పైకిలేచి, తిరిగి చూడకుండా బలరామయ్య బయటికి వచ్చేశాడు.

5

మనిషైతే వచ్చేశాడు గానీ, మనసు మాత్రం అక్కడే పరిభ్రమిస్తోంది.

ఇంటిని అమ్మివేస్తున్నట్లు చెప్పాడు యజమాని. కొంపదీసి దీన్ని కొనుక్కున్న వాడు గోపాలం కాదు గదా!

బలరామయ్య ఆశ్చర్య సాగరంలో మునిగి అట్టడుక్కు వెళ్లిపోయాడు. అలాగైతే వీడి కెక్కడినుంచి లభ్యమైనట్టు డబ్బు? ఒకవేళ వీడి మామ గారిచ్చారేమో! ఐనా ఒక్కసారిగా కొన్నివేల రూపాయలు ఇచ్చుకోగల స్తోమత ఆ మామగారికి లేదే.

ఈ సందేహం బలరామయ్యను ఒక పట్టాన వదిలింది కాదు. అయిదారు రోజులు అతడు సరిగ్గా తిండీ నిద్రా లేకుండా ఆలోచించాడు. చివరకు అతడి సందేహాన్ని పటాపంచలుచేస్తూ పోస్టులో ఓ రిజిస్ట్రరు నోటీసు వచ్చింది.

భూ స్థితిలో తనకు సంక్రమించవలసిన వాటాను గోపాలం ఎవరికో పదివేల రూపాయలకు అమ్మేశాడు. వాళ్ళు తక్షణం వచ్చి కొలతలువేసి భూమిని పంచుకోగోరుతూ బలరామయ్యకు తాఖీదు పంపారు.

బలరామయ్య కళ్ల ఎదుట ప్రపంచం గిర్రున తిరుగ సాగింది. అతడు హతాశుడై కూర్చున్న కుర్చీలోనే కృంగిపోయాడు. ★